ఆదయ్యనగర్‌లో ఉచిత వైద్య శిబిరం



పద్మారావునగర్: మోండా మార్కెట్ డివిజన్ ఆదయ్యనగర్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనహిత సేవా ట్రస్ట్, నైటింగేల్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, రెయిన్ బో హోమ్స్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పెద్ద ఎత్తున ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నర్సింహమూర్తి, కో–ఆర్డినేటర్ బి. నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

గాంధీలో ఘనంగా బోనాల వేడుకలు



గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద టీఎన్‌జీవో గాంధీ యూనిట్ ఆధ్వర్యంలో శ్రావణ మాస బోనాల జాతర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, ఉద్యోగులు, సిబ్బంది అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, డిప్యూటీ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ–1 శేషాద్రి, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఐదేళ్ల పీజీ కోర్సుల ఎంట్రన్స్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఐదేళ్ల పీజీ కోర్సుల ఎంట్రన్స్ ఫలితాలను విడుదల చేసినట్లు సీపీగెట్–2025 కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి బుధవారం తెలిపారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫార్మసుటికల్ కెమిస్ట్రీ, ఎంఏ ఎకనామిక్స్, ఎంబీఏ కోర్సుల ఫలితాలను ఉస్మానియా వెబ్‌సైట్లో చూడవచ్చు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు గురువారం నుంచి (21న) ర్యాంక్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని, 25 నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు.

గాంధీఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం



శ్రీనివాస్

గాంధీఆస్పత్రి: వైద్యం కోసం వచ్చిన రోగి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన మేరకు.. రాజన్నసిరిసిల్లా జిల్లాకు చెందిన చెందిన శ్రీనివాస్ (44)ను ఈనెల 18న భార్య లక్ష్మీ శ్రీనివాస్‌ను గాంధీ ఆస్పత్రికి పిలుచుకువచ్చింది. ఓపీ చిట్టీ తీసుకుని న్యూరాలజీవార్డుకు వెళ్లింది. బాత్ రూమ్‌కు అని చెప్పి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి వార్డుకు చేరలేదు. పరిసర ప్రాంతాలతోపాటు స్వగ్రామంలో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో భార్యలక్ష్మీ పోలీసులను ఆశ్రయించింది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణవాడీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట బ్రాహ్మణవాడీలోని పోస్టాఫీసు ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు 108 వాహన సిబ్బందితో కలిసి పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు.

సెల్‌ఫోన్ దొంగకు రెండేళ్లు జైలుశిక్ష



అబ్దుల్‌గఫర్

చిలకలగూడ: సెల్‌ఫోన్ దొంగతనం కేసులో నిందితునికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ తెలిపిన మేరకు.. ముషీరాబాద్ భోలక్‌పూర్ గుల్షన్‌నగర్‌కు చెందిన అబ్దుల్‌గఫర్ అలియాస్ టిప్పు (25) కూలి పనులు చేస్తు జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. చిలకలగూడ ఠాణా పరిధిలో 2018లో సెల్‌ఫోన్ చోరీలు చేస్తు పోలీసులకు చిక్కడంతో అప్పటి ఎస్ఐ రాజునాయక్ నేతృత్వంలో వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. చార్జీషీట్ ప్రక్రియ పూర్తి చేసి తగిన ఆధారాలు కోర్టుకు సమర్పించారు. వాదోపవాదాలు విన్న సికింద్రాబాద్ 19ఏసీజేఎం మెజిస్ట్రేట్ అరుణ తీర్పు వెలువరించారు. అబ్దుల్‌గఫర్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ.1000 జరిమాన విధిస్తు ఆదేశాలు జారీ చేశారు.

గ్రంథాలయం.. కలలకు సాకారం

లైబ్రరీలో చదివి ఉద్యోగాలు పొందిన యువకులు

నిరుద్యోగుల కలలను సాకారం చేస్తున్న ఎస్సార్‌నగర్ గ్రంథాలయం



సనత్‌నగర్: సంగారెడ్డికి చెందిన శివరామ్ సర్కార్ కొలువు సాధించాలనేది కల. మహానగరంలో ఉద్యోగం చేస్తే గానీ బతుకుబండి నడవని స్థితి. అందుకే పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూనే ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు ప్రిపేర్ అయ్యి వార్డు ఆఫీసర్ ఉద్యోగం సంపాదించాడు. ఇదంతా కేవలం గ్రంథాలయంలో లభించే మెటీరియల్ ఆధారంగానే సాధించానని చెప్పుకొచ్చాడు.

- మహబూబాబాద్‌కు చెందిన పృథ్వీరాజ్ పరిస్థితి కూడా దాదాపు అంతే. ప్రతిరోజు ఎంతోకొంత సమయం కేటాయించి గ్రంథాలయానికి వచ్చి చదువుకునేవాడు. అవసరమైన మెటీరియల్‌ను తీసుకుని పరీక్షలకు ప్రిపేర్ అయ్యి సర్కార్ జాబ్ కొట్టాడు.
- సూర్యాపేట్‌కు చెందిన వంశీకృష్ణారెడ్డి సైతం సర్కార్ జాబ్ సాధనకు గ్రంథాలయాన్నే వేదికగా చేసుకుని కసరత్తు చేసి తన కలను నెరవేర్చుకున్నాడు.
- ఏపీకి చెందిన విజయదుర్గ గ్రంథాలయం అందించిన విజ్ఞాన సముపార్జన ఆధారంగా పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించి స్ఫూర్తిగా నిలిచారు.

ఇలా ఒక్క శివరామ్, పృథ్వీరాజ్, వంశీకృష్ణారెడ్డి,



విజయదుర్గాలు మాత్రమే కాదు..మరెందరికో ఉపాధి వైపు బాటలు వేస్తున్నాయి. మహానగర గ్రంథాలయ సంస్థలు. ప్రధానంగా ఎస్సార్‌నగర్ గ్రంథాలయ కేంద్రంగా ప్రతిరోజూ వందల సంఖ్యలో యువత వచ్చి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటారు. ఇక్కడ చదువుకునే తీరును చూస్తే ఇది ఏమైనా కోచింగ్ సెంటరా.. లేక గ్రంథాలయమా? అన్న సందేహం కలగకమానదు. గ్రంథాలయాలు సైతం కాలంతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని పాఠకులకు అందించడంలో ముందుంటున్నాయి. ఎస్సార్‌నగర్ గ్రంథాలయంలో 15 వేల పైచిలుకు వివిధ రకాల పుస్తకాలు కొలువుదీరి ఉన్నాయి. ఇందులో సాహిత్యం, నవలలు, పురాణగాధలు, ఇతిహాసం, చరిత్ర, రామాయణ, భారత, భాగవతం వంటి ఆధ్యాత్మిక పుస్తకాలే కాకుండా కాలానికి అనుగుణంగా అధునాతన పరిజ్ఞానాన్ని జోడించిన పుస్తకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడం, వాటిని యువత సద్వినియోగం చేసుకోవడం జరుగుతున్నాయి. ముఖ్యంగా గ్రూప్ ఎగ్జామ్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, బీఈడీ, డీఎస్సీ, బ్యాంక్, ఇతర సర్కారీ కొలువులకు సంబంధించిన పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ఇక్కడ లభిస్తోంది. ఎప్పటికప్పుడు తాజా వార్తలను అందించే అన్ని రకాల దిన, వార, పక్ష, మాస పత్రికలతో పాటు ఉద్యోగ సోపానం, విజేత కాంపిటీషన్స్, ప్రతియోగిత్‌దర్పన్, కాంపిటేటివ్ న్యూస్ మ్యాగజైన్ వంటి పలు రకాల పుస్తకాలు ఇక్కడ లభిస్తున్నాయి. వేలకు వేలు పోసి విద్యార్థులకు మెటీరియల్‌ను కొనుక్కోవాల్సిన అవసరం లేకుండా ఉచితంగా ఇక్కడ పుస్తకాలు పొంది చదువుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

ఫస్ట్ చిక్కడపల్లి.. నెక్ట్స్ ఎస్సార్‌నగర్..

చిక్కడపల్లి తర్వాత ఎస్సార్‌నగర్ లైబ్రరీకే యువత ఎక్కువ వస్తుండడం, ఇక్కడ ప్రిపేర్ అయ్యి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం కళ్ల ముందు కనిపించే నగ్న సత్యాలు. ఇక్కడికి వచ్చే దాదాపు 500 మందిలో 80 శాతం మంది విద్యార్థులే కావడం గమనార్హం. గ్రంథాలయం కేంద్రంగా చదువుకుని ఇప్పటివరకు పదుల సంఖ్యలో విద్యార్థులు సర్కారీ కొలువుల్లో స్థిరపడ్డారు. జాబ్ ఇంటర్వ్యూల్లో మెలకువలను తెలుసుకోవడానికి సైతం చాలామంది ఇక్కడికి వస్తుంటారు. ఏవైనా సందేహాలు ఉంటే పరస్పరం తీర్చుకుంటుంటారు. ఇక్కడికి వచ్చే విద్యార్థుల సంఖ్యను బట్టి వసతులను కూడా కల్పించుకుంటూ వెళ్తున్నారు.

ఎంతో ఆనందంగా ఉంది: హరిబాబు, లైబ్రేరియన్

ఎవరైనా విద్యార్థులు ఫలానా మెటీరియల్ గురించి అడిగితే ఇక్కడ లేకపోయినా వేరే లైబ్రరీల నుంచి గానీ, లేక వేరే సంస్థల నుంచి గానీ తెచ్చి అందించడం జరుగుతుంది. ఇప్పటివరకు ఇక్కడ చదువుకున్న వారిలో ఎంతోమంది గవర్నమెంట్ జాబ్‌లు సాధించడం ఆనందంగా ఉంది. పాఠకుల సంఖ్య ఆధారంగా ఎప్పటికప్పుడు వసతులు కల్పించడంతో పాటు రీడింగ్ రూమ్‌లను విస్తరించుకుంటూ వెళ్తున్నాం.

నవరాత్రుల్లో నిరంతర విద్యుత్ సరఫరా

- సికింద్రాబాద్‌లో ప్రత్యేకంగా మూడు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు
- విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ ఆపరేటర్లవైర్ల తొలగింపు
- సికింద్రాబాద్ విద్యుత్ డీఈ బ్రహ్మానందం



బన్సీలాల్‌పేట్: గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీ చర్యలకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సికింద్రాబాద్ విద్యుత్తు శాఖ డివిజనల్ ఇంజనీర్ సీహెచ్ బ్రహ్మానందం చెప్పారు. పద్మారావునగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం సాక్షితో మాట్లాడారు. సికింద్రాబాద్‌లో విద్యుత్ శాఖ తీరుతెన్నులు ..కేబుల్ వైర్ల తొలగింపు, గణేష్ ఉత్సవాల సందర్భంగా విద్యుత్తు శాఖ ఏర్పాట్ల గురించి డీఈ వివరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ ఏరియాలో అదనంగా మూడు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గణేష్ మండపాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు కాకుండా గట్టి చర్యలు తీసుకుంటుమని వివరించారు.

- సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుళ్లను తొలగిస్తున్నాము. డివిజన్ పరిధిలోని 9 సెక్షన్ కార్యాలయాల పరిధిలో కేబుళ్లపై సర్వే చేశాం. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రమాదభరితంగా ఉన్న కేబుళ్లను గుర్తించాం.
- విద్యుత్తు స్తంభాలకు ఎక్కడ పడితే అక్కడ ఉన్న వాటిని కేబుల్ వైర్ల తొలగింపునకు శ్రీకారం చుట్టాం. సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి, పద్మారావునగర్, మెట్టుగూడ, తార్నాక, బైబిల్ హౌస్, క్లాక్‌టవర్ తదితర ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్ వైర్లను తొలగించాం. మరికొన్ని చోట్లను గుర్తించాం. రానున్న గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా ఊరేగింపులకు ఆటంకంగా ఉండే కేబుల్ వైర్లను తొలగిస్తాము.
- గణేష్ వేడుకల సందర్భంగా విద్యుత్తు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాము. సికింద్రాబాద్‌లో అదనపు విద్యుత్తు లోడ్ కోసం మూడు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాము. సరఫరాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్తు సరఫరా చేస్తాము. డివిజన్‌లో మూడు చోట్ల నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాము. సిబ్బంది రాత్రింపగళ్లు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ మేరకు తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.
- గణేష్ మండపాల నిర్వాహకులు స్థానిక సెక్షన్ కార్యాయంలో ఏ ప్రాంతంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారో ముందస్తుగా తెలియజేయాలి. అవసరం మేరకు అదనపు లోడ్‌ను సరఫరాల చేస్తారు. 250 వాట్స్‌లోడ్ ఉన్న మండప నిర్వాహకులు రూ. 500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అదే విధంగా 250–500 వాట్స్ విద్యుత్తు లోడ్ డిమాండ్ అవసరం ఉన్న వాళ్లు రూ. 1,000 చెల్లించాలి. 2 కిలో వాట్స్ విద్యుత్తు లోడ్ డిమాండ్ ఉన్నవారు సుమారు రూ. 3,000 విద్యుత్తు శాఖకు దరఖాస్తుతో అందజేయాల్సి ఉంటుంది.
- గణేష్ ఉత్సవాల సందర్భంగా తమ సిబ్బంది 24గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎక్కడ ఎలాంటి సమస్యలున్నా వెంటనే మండప నిర్వాహకులు, ప్రజలు తమకు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాము. సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని 9 సెక్షన్ కార్యాలయాల పరిధిలో ఎఫ్ఓసీ సెంటర్లు రాత్రింపగళ్లు పని చేస్తాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై నిర్దిష్టంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరి

రాంగోపాల్‌పేట్: మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకోవడానికి లీగల్ సర్వీస్ అథారిటీ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరి తెలిపారు. సికింద్రాబాద్‌లోని అమృతవాణి కాంప్లెక్స్‌లో బుధవారం 'క్రిస్టియన్ మీడియేషన్ సెంటర్' ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి పంచాక్షరి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంబంధించినటువంటి లావాదేవీ కేసులు, సివిల్ కేసులు, సంఘాలకు సంబంధించిన కేసులు, ఫ్యామిలీ సంబంధిత కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకొనే వెసులుబాటును కల్పిస్తూ సెంటర్ ప్రారంభించినట్లు తెలిపారు. అడ్వకేట్ అండ్ మీడియేటర్ ఆరిఫ్, చర్చ్ ఫాదర్ రాజు అలెక్స్ పాల్గొన్నారు.

సరైన అవగాహన లేకనే దోమల వృద్ధి: జితేందర్‌కుమార్‌నాయక్



సదస్సుకు హాజరైన జితేందర్‌కుమార్‌నాయక్

సనత్‌నగర్: దోమల వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఎస్.జితేందర్‌కుమార్‌నాయక్ అన్నారు. బుధవారం బేగంపేటలోని సర్ రోనాల్డ్ రోస్ భవనంలో 'ది మస్కిటో, మలేరియా అండ్ వన్ హెల్త్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్.జితేందర్‌కుమార్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దోమల నివారణపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గాంధీ వైద్య కళాశాల ప్రొఫెసర్ ఎం.రమాదేవి, ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగం డీన్ సీనియర్ ప్రొఫెసర్ కరుణాసాగర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించాలి



విక్టోరియాగంజ్ బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు సకాలంలో స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఓల్డ్‌బోయిగూడ విక్టోరియాగంజ్ బస్తీలో బుధవారం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విక్టోరియా గంజ్ బస్తీలో డ్రైనేజీ, విద్యుత్తు ఇతరత్రా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అనేక బస్తీలు, ప్రాంతాల్లో ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్న విషయాన్ని తన దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమీషనర్ దాకునాయక్, జలమండలి డీజీఎం ఆశీష్, ఉద్యావన శాఖ అధికారి రాజిరెడ్డి, వీధి దీపాల ఏఈ సాగర్, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు.

నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం



కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమర్ సింగ్

లాలాపేట: నేరాలను ఛేదించడంతో పాటు అదుపు చేయడంలో సీసీ టీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని లాలాగూడ ఇన్‌స్పెక్టర్ అమర్‌సింగ్ అన్నారు. బుధవారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియం వద్ద కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణపతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలన్నారు. వేడుకల్లో ఏలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక మండప నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లాలాగూడ పోలీసు సిబ్బంది, స్థానిక నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, శైలేందర్, గోవింద్, హరి తదితరులున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమీషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం సమర్పించిన అభినవనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ అభినవనగర్ కాలనీ వాసులు బుధవారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమీషనర్ రవికిరణ్‌ను కలిశారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రాజీవ్ దేశ్‌పాండే, ఎస్వీ రెడ్డి, సుభాష్, ఆంజనేయులు, ఓం ప్రకాష్, అనిల్, క్రిష్ణారెడ్డిలతో పాటు బీజేపీ నాయకులు చంద్రపాల్‌రెడ్డి, దయానంద్, రమేష్ కలిసి కాలనీ పలు సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు. గాంధీ ఆసుపత్రి నుంచి అభినవనగర్‌కాలనీ మీదుగా వెళ్లే కచ్చామోరీ నిత్యం పొంగిపొర్లుతుండటంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వర్షానికి రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని వాటిపై నుంచి రాకపోకలు సాగించడం కష్టతరంగా మారిందన్నారు.

ఆత్మీయ సత్కారం



అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయం అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న కస్తూరి మురళీకృష్ణకి బుధవారం తోటి ఉద్యోగులు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ముప్పై సంవత్సరాలు కలిసి పని చేసిన ఉద్యోగులు పాత అనుభవాలు, అనుభూతులు నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం, ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఓయూలో సీఎం కార్యక్రమం వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు గురువారం (21న) సీఎం రేవంత్ రెడ్డి రాక వాయిదా పడింది. క్యాంపస్‌లో నిర్మించిన రెండు హాస్టల్ భవనాల ప్రారంభం, మరో రెండు హాస్టల్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాకు సీఎం ఓయూకు రావలసి ఉంది. అయితే ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి నామినేషన్ వేయనున్నందున సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నట్లు సమాచారం. హాస్టల్ భవనాల ప్రారంభం, ఇతర కార్యక్రమాల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

రైళ్లపై రాళ్లు రువ్వితే జైలుకు వెళ్లడం ఖాయం

సికింద్రాబాద్: రైళ్లపై రాళ్లు రువ్వడం, రైల్వే ఆస్తులను ధ్వంసం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆలకుంట నవీన్ కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైల్వే ట్రాక్‌లు, లైన్లకు సమీపంలో నివసిస్తున్న ప్రజలకు రైళ్లపై రాళ్లు రువ్వడం ద్వారా ఎదురయ్యే అనర్థాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రైల్వే ఆస్తులను పరిరక్షించడంలో సహకారం అందిస్తామని ట్రాక్ పరిసర ప్రాంతాల ప్రజలచే ప్రతిజ్ఞలు చేయిస్తున్నట్టు చెప్పారు. డివిజన్ పరిధిలో రైళ్లపై రాళ్లు రువ్విన 82 మందిని గుర్తించి రిమాండ్‌కు తరలించామన్నారు. సీసీ కెమెరాలు, ఇతరత్రా సాంకేతికత ఆధారంగా రైళ్లపై దాడులకు పాల్పడుతన్న వ్యక్తులకు వెంటనే గుర్తిస్తున్నామని చెప్పారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సనత్‌నగర్, కంటోన్మెంట్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో పలుచోట్ల కార్యక్రమాలు నిర్వహించి రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. శాస్త్ర,సాంకేతిక రంగాల్లో దేశాన్ని అగ్రభాగాన నిలిపిన నాయకుడు అని పలువురు నాయకులు పేర్కొన్నారు.



బేగంపేట పోలీస్‌లైన్స్‌లో రాజీవ్‌గాంధీకి నివాళులు అర్పిస్తున్న కోట నీలిమ..



బాలంరాయిలో రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ ఆనంద్‌బాబు



రాంగోపాల్‌పేట రంగ్రేజ్‌బజార్‌లో నివాళులర్పిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు మహేష్‌కుమార్

పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు



బాపూనగర్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న శానిటేషన్ సిబ్బంధి

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను బుధవారం సిబ్బంది తొలగించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఎస్ఆర్‌నగర్ ప్రధాన రహదారి పక్కన చెట్లు విరిగి పడి ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి.స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ,హైడ్రా సిబ్బందితో కలిసి చెట్లను తొలగించారు.

ఉప్పల్ తరహా ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు

సికింద్రాబాద్: వినాయకచవితి నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల ఏర్పాటు, విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించునేందుకు సీతాఫల్‌మండి డివిజన్ అధికారుల సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఉప్పల్ తరహా ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని ముందస్తు చర్యల గురించి సమావేశంలో చర్చించారు. నామాలగుండులోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ సామల హేమ నిర్వహించిన సమావేశంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు. నిరాటంకంగా వర్షాలు బారీగా కురుస్తున్నందున విద్యుత్, జలమండలి, ఎలక్ట్రిసిటీ అధికారులు సమన్వయంతో వ్యవహరించేందుకు సమావేశంలో అవసరమైన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, జలమండలి మేనేజర్లు కుషాల్, నవ్య, హార్టికల్చర్ మేనేజర్ చంద్రోఖర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సనత్‌నగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం..టివోలి నుంచి బ్రూక్‌బాండ్ వెళ్లే రోడ్డులో మిలటరీ కాహౌస్ గేటు వద్ద గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ కారు–2 సిబ్బంది వెంటనే అంబులెన్స్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతిచెంది ఉన్నట్లు నిర్ధారించారు. అయితే మృతుడి ముఖంపై రక్తపు గాయాలు, కుడికాలు విరిగినట్లు గుర్తించారు. గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధించి వివరాలు తెలియరాలేదు. వయస్సు 42 నుంచి 45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. చేతిపై లవ్ సింబల్‌తో పాటు పద్మ అని పచ్చబొట్టు వేసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సంబంధీకులు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.